# ఉత్తిష్ఠ!

శ్రీ రావూరి భరద్వాజ

వామనరావు కిటికీ తెరిచాడు. ఎదురుగా రంగయ్య మేడ కనిపించింది— అప్పటికప్పుడే రంగయ్య బాల్కనీలో నిలబడి కాఫీ తాగుతున్నాడు. రేడియో వార్తలు చెబుతున్నది. వాకిట్లో కారు అతనికోసం ఎదురు చూస్తున్నది. 'అదృష్టం' అనుకొన్నాడు వామనరావు. ఆ వెంటనే తన ఇల్లు, దరిద్రం, అనునిత్యం తనుపడే బాధలు జ్ఞప్తికొచ్చాయి. 'నా కర్మ' అనుకొన్నాడు వామనరావు.

నిజమే మరి! తను చేస్తున్నది పంతులు పని. ఈ ఉద్యోగం తనను చావనీయటంలేదు, పోనీకదా, సుఖంగానూ బ్రతికేందుకు లేదు. అనేకసార్లు ఈ ఉద్యోగము వొదులుకొందామనుకున్నాడు వామనరావు. కానీ వొదులుకొని? ఆ తరవాత ఏదో చిన్న వ్యాపారం చేసుకొందామనీ, మంచి నౌకరీ మరొకటి చూచుకొందామనీ, బైరాగుల్లో కలుద్దామనీ దగ్గిరా దగ్గిరా సద్భావాలు కలిగాయి. కానీ వామనరావు వీటిల్లో ఏ వొక్కటీ ఆచరించలేదు. అన్నట్టు వామనరావు వివాహితుడు. అతనికి ఇద్దరు పిల్లలున్నారు.

మన కథాకాలంనాటికి వామనరావు మాంచి ఇబ్బందుల్లో ఉన్నాడు. భార్య కావలసిన వస్తువుల జాబితా చదివి వెళ్ళింది. అతగాడు 'ఊఁ' కొట్టాడు. ఏమి చెయ్యటానికీ తోచక వామనరావు కిటికీ తెరిచాడు. ఎదురుగా రంగయ్య మేడ కనిపించింది.

రంగయ్య అట్టే చదువుకోలేదు. అయితేనేం— అతనికి కట్టుకుపోయినంత డబ్బున్నది. ఇంకా సంపాదిస్తున్నాడు. ఊళ్ళో పెద్ద పలుకుబడి ఉంది. ఏ ఆఫీసరొచ్చినా ముందు రంగయ్య సందర్శనం చేసుకోవలసిందే! అతనంటే చాలామంది భయపడతారు. తను వీటికి పూర్తిగా విరోధి. తనను చూసే దిక్కులేదు. తను తిండికోసం గిజ గిజ లాడుతుంటే జాలితలచేవాళ్ళు లేరు. తన ఖర్మ!

“డబ్బు! డబ్బు కావాలి. అదిఉంటే చాలు. కొండమీది కోతి దిగొస్తుంది. అన్ని సౌఖ్యాలూ అనుభవించవొచ్చు. అన్ని యోగ్యతలూ వాటంతటవే పుట్టుకొస్తాయి” అనుకొన్నాడు వామనరావు. జీవితంలో అంతకంటే సాధించవలసిందేమీ లేదనిపించింది వామనరావుకు.

◆ ◆ ◆

ఆవరణనిండా జనం నిండిపోయారు. ముందువరస కుర్చీల్లో పెద్ద మనుషులు కూచున్నారు. రంగయ్యగారు ఉపన్యాసం చెబుతున్నాయనవేపు నోరు తెరచుకు చూస్తున్నాడు. ఆఉపన్యాసకు

http://www.maganti.org/

డెవరో వామనరావు ప్రక్కాయన నడిగి తెలిసికొన్నాడు వామనరావు. అతనికి ఆశ్చర్యమేసింది. ప్రభాకర్ పేరు అతనికి చిరపరిచితమే! అతని వ్యాసాలు తను అనేకం చదివాడు. అవి తనకు బోధపడలేదు. కానీ ఆ వ్యాసకర్త ఘటికుడేననిపించింది అతనికి. భారతం గురించి, కాళిదాసును గురించీ, ఇంకెవరెవరివో పద్యాలు చదివేస్తూ అనర్గళంగా ఉపన్యసిస్తున్నాడు ప్రభాకర్. జనం నిశ్శబ్దంగా వింటున్నారు. వామనరావు చుట్టూ జనాన్ని చూశాడు. అతనికొక ఊహతట్టింది.

“డబ్బు! వెధవడబ్బు! ఎంత ఉంటేనేం? అతనికున్న గౌరవం, ఎంతడబ్బు ఖర్చుచేస్తే వొస్తుంది! రంగయ్యలాంటి బంగారు పిచ్చికలు సాధించలేని పనిని, ప్రభాకర్ సాధించగలడు. రంగయ్యను ఊరూరే గౌరవిస్తుంది. కానీ ప్రభాకర్‌ను దేశమంతా గౌరవిస్తుంది. మనిషికి ప్రధానం డబ్బు కానే కాదు. చదువు, చదువు కావాలి” అనుకొన్నాడు వామనరావు.

ఎనిమిది గంటలదాకా ఉపన్యాసం సాగింది. అనంతరం అధ్యక్షులు లేచి సభ ముగిసిందనీ, వైజ్ఞానిక కార్యక్రమం రాత్రి పదిగంటలకు ప్రారంభమవుతుందనీ చెప్పాడు.

◆ ◆ ◆

వామనరావు ఆదరాబాదరా రెండు మెతుకులు కొరికి బయటికొచ్చాడు. అప్పటికే జనం ఆవరణానిండా నిండిపోయారు. ప్రతివాడి ముఖాన ఆతురత కనిపిస్తోంది. కారణంకోసం వెదికాడు వామనరావు. ఎవ్వరూ అతనిగొడవ వినిపించుకోలేదు. మెల్లగా వేదిక దగ్గరికొచ్చాడు. చిరిచాపలమీద శకుమనుషులు ఆసీనులయ్యారు. రంగయ్యగారూ ప్రభాకర్‌గారూ ఏవో మాట్లాడుతున్నారు. వామనరావు తనను తను నమ్మలేకపోయాడు. ఏదో ఆలోచించబోయాడు. జనంలో కలకలం రేగింది- వేదికమీదకు చూశాడు. కుమారి వాసంతి వయ్యారంగా కూర్చుని ఉంది.

వాసంతి ప్రసిద్ధిచెందిన పాతిక సినిమాల్లో నటించింది. ఆమె నటించిన ప్రతి సినిమా డబ్బుచేసుకొంది. ఆమె డాన్సులంటే జనం పడిచస్తారు. ఆమెకు ఇంకా పెళ్ళికాలేదు.

వాసంతి లేచింది. జనం గగ్గోలుపడ్డది. అధ్యక్షులు సర్ది చెప్పారు. సినిమా నటనను గురించి కుమారి అరగంట మాట్లాడింది. జనంలోనించి, ఆమె నటించిన సినిమాల్లో పాటలు కావాలని కేకలు. ఆమె తప్పుకోవాలని చూసింది గానీ వీల్లేకపోయింది. చివరకు ‘పట్టూ విడువకురా! పరవశమౌతున్నదిరా!’ అన్న పాటా ‘మదనతాపము తీర్చరావోయి ప్రియతమా’ అన్నపాటా పాడింది. జనం చప్పట్లు కొట్టారు. ఈలలు వేశారు. కొందరు పూలూ, ఇంకొందరు, రూపాయలనోట్లు, ఒకరిద్దరు సిగరెట్ పీకలు ఆమె మీదకు విసిరారు. సభ గగ్గోలయింది.

http://www.maganti.org/

వామనరావుకో క నూతన సత్యం గోచరించింది.

"చదువుకూడా ముఖ్యం కాదు. సినిమాలో నటించాలి. మహా పండితుడైన ప్రభాకర్‌కు లేని గౌరవం వాసంతికున్నది. ఆమె పేరు తెలిసినంతమందికి-పోనీ- అందులో పదోవంతుమందికి ప్రభాకర్ పేరు తెలియదు. ఆమెను ఆరాధిస్తున్న వాళ్లు లక్షలు. మరి ప్రభాకర్‌ను? ఇందాక అతను మాట్లాడుతున్నప్పుడు, లోగడ అతని వ్యాసాల్లోని దొక్క భాగం చదవమన్నవాడులేడు. శ్రీమతి వాసంతికి ఓపిక ఉంటే మూడు రోజులు ఈ విధంగా ఆవిడ పాటలు వినేందుకు ప్రజలు సిద్ధం. జీవితమంటే అదే జీవితం. మిగతాదంతా పరమచెత్త" అనుకొన్నాడు వామనరావు.

అనుకొంటూ ఇంటికొస్తున్నాడు. మధ్యలో అతన్ని మరొకడు అనుసరిస్తున్నాడు. చాలా సేపటికి గానీ వామనరావు అతన్ని గమనించలేదు.

'ఏమిటి?' అన్నాడు వామనరావు. ఆ వ్యక్తి తనగోడద చెప్పుకొన్నాడు. ఇంటర్ చదివాట్ట. ఎక్కడా ఉద్యోగం లేదట. చాలా ప్రయత్నం చేశాడట. లాభం లేకపోయిందట. రెండురోజుల నించీ భోజనం చేయలేదట. ఉదయం నుండీ కాఫీ కూడా తాగలేదట. వామనరావు జేబులోంచి అణా కాను తీసి అతని కిచ్చాడు.

"నేనేమిటో అనుకొన్నాను. ఈ లెఖ్ఖన చూస్తే నే పడుతున్నవి బాధలు కానే కావు. స్కూలు ఫైనలు వెధవను. నెలకు పదిరాళ్లు తెచ్చుకోవటం ఘనకార్యం క్రిందనే జమ. నేను పైవాళ్లను చూచి ఏమిటో అనుకున్నాను— కానీ నన్ను చూసి—"

వామనరావుకు తన జీవితం ఆనందమయంగా తోచింది. త్వరగా త్వరగా ఇంటివేపు అడుగులు వేయసాగాడు.

---

నాటక కళా పరిషత్తు సభల నేపథ్యంలో

* శ్రీ కాజ వెంకటరామయ్యగారు 'ఎందెందు వెదకి చూచిన అందందే' కన్పడుతూ, కార్యక్రమంలో- సాధ్యమైనంత వరకు- లోటుపాట్లు రాకుండా చూసుకున్నారు.

* స్టేజి మానేజ్ చేసిన శ్రీ 'నాదెళ్ల' గారు చెమటోడ్చి, రేబవళ్లూ, పని చేసారు.

* అందరి శ్రమా ఒకయెత్తు అయితే, శ్రీ మాధవాచార్యులుగారి శ్రమ ఒక ఎత్తు! ఆ వినయం, ఆ నమ్రత, ఆ కలుపుగోలు తనం ...

* అన్నిటికీ మించి - పరిషత్సభలకు ప్రాణం పోసింది 'మినర్వా' యజమానుల సహకారం!

---

http://www.maganti.org/

Source: Press Academy Website, Brundavani Magazine, May 1954

**Disclaimer:** This topic/article/write-up of Sri Ravuri Bharadwaja has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan